క్లుప్తంగా

ఉద్యోగ విరమణ సత్కారం



మూర్తిని సత్కరిస్తున్న జడ్జి సరిత

తిరుపతి అర్బన్ : ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తున్న శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన 13 మందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీపీటీఓ నరసింహులు, పీఓ షహజాద్, డీఎం బాలాజీ, ఏటీఎం రామచంద్రనాయుడు, ఉద్యోగ సంఘం నేతలు చల్లా చంద్రయ్య, అర్జునయ్య, సత్యానారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.మొహిద్దీన్‌బాషాను ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం పలువురు ఘనంగా సత్కరించారు. ఆచార్య సత్తార్‌సాహిర్, డాక్టర్ దామోదర్‌నాయుడు, డాక్టర్ రాజేంద్రరెడ్డి, ఏఆర్.చంద్రశేఖర్, ఎన్‌సీ రామచంద్రారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంపీపీ పాఠశాలలో..

దామలచెరువు తురకపల్లెఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం ఖాదర్‌బాషాను ఉద్యోగ విరమణ సందర్భంగా ఎంఈఓ బాబ్జీ సత్కరించారు.

తిరుపతి లీగల్ : కోర్టు ఉద్యోగి మూర్తి సేవలు మరువలేమని తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత కొనియాడారు. శుక్రవారం ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. నరహరి, రమేష్, కనక నరసారెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థినికి కిట్ అందిస్తున్న హర్షిత్‌రెడ్డి

భాకరాపేట : విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా ఎదగాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కోరారు. శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట, రంగన్నగారిగడ్డ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రితో కూడిన కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు హరనాథ్, ఓబుల్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, భూపాల్, మనోహర్, రఘునాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, షాబాద్‌అలీఖాన్ పాల్గొన్నారు.

తిరుపతి రూరల్ : ఇంటర్, పదో తరగతి పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హర్షిత్ రెడ్డి కోరారు. శుక్రవారం తుమ్మలగుంటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విద్యార్థి విభాగం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద కల్పించిన వసతులను పరిశీలించాలని ఆదేశించారు.

ఘనంగా టైలర్స్ డే



కేక్ కట్ చేస్తున్న టైలర్ల సంఘం నేతలు

తిరుపతి కల్చరల్ : జీవలింగేశ్వర టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా టైలర్స్ డే నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసులు, గోవిందరాజులు, శర వణ, మురళి, కదిరి రాజేంద్ర, టైలర్స్ పాల్గొన్నారు.

పాకాల : చైతన్య టైలర్స్ సంఘం నేతృత్వంలో టైలర్స్ డే నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు వేణు, సీఐటీయూ నేతలు మధుసూదన్‌రావు, ప్రసాద్, టైలర్లు షరీఫ్, అబ్దుల్ రజాక్, శేఖర్‌రెడ్డి, హబీబ్, త్యాగరాజులు, చంద్ర పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి జైలు

తిరుపతి లీగల్: చీటింగ్ కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంత్‌కుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. కోర్టు కానిస్టేబుల్ శేఖర్ కథనం మేరకు.. చిత్తూరు జిల్లా ఐరాల మండలం రంగమ్మ చెరువు గ్రామానికి చెందిన టి.నాగరత్నం రెడ్డి తన కుమార్తెను తిరుపతి రూరల్ మండలం మల్లంగుంట గ్రామం ప్రియదర్శిని కాలనీకి చెందిన సుబ్రమణ్యం రెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. తర్వాత కొన్నాళ్లకు నాగరత్నం రెడ్డి కుటుంబం మల్లం గుంటకు వలస వచ్చింది. 2013 డిసెంబర్ 20న కె.జయచంద్ర వద్ద రూ.3 లక్షలు అప్పుగా మామాఅల్లుళ్లు తీసుకున్నారు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో తప్పుడు చెక్ ఇచ్చారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఎస్వీయూ పోలీసులు కేసు దర్యాప్తు చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి శిక్ష విధించారు. జరిమానా సొమ్మును అప్పీలు కాలం ముగిసిన తర్వాత రూ.20 వేలను ఫిర్యాది జయచంద్రకు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

> పాకాల మండలంలో దొంగల పని మూడు చోరీలు ఆరు దోపిడీలుగా సాగుతోంది. ఏదైనా కేసులో పట్టుబడినా ఏముందిలే ఎంతో కొంత ఇచ్చేసి పోలీసులను కొనేద్దాం అనే ధీమా వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే ఇటీవల దొంగతనాలు విపరీతంగా పెరిగిపోయినట్లు ప్రజానీకం చర్చించుకుంటోంది. చోరులకు ఓ పోలీసు అధికారితోపాటు కానిస్టేబుల్ పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలుస్తోంది. మామూళ్లు తీసుకుని పట్టుబడిన నిందితులను యథేచ్ఛగా వదిలేస్తున్నట్లు సమాచారం.

సెటిల్‌మెంట్ స్టేషన్



పాకాల పోలీస్ స్టేషన్

- దొంగలతో కుమ్మక్కవుతున్న పోలీసులు
- బాధితుల నోట్లో మట్టి కొడుతున్న లంచావతారులు
- పట్టించుకోని ఉన్నతాధికారుల

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పోలీసుల అండతో దొంగలు రెచ్చిపోతున్నారు. ఒకవేళ పట్టుబడినా త్రుణమో.. పణమో ముట్టజెప్పి కేసుల నుంచి తప్పించుకోవచ్చని చెలరేగిపోతున్నారు. వివరాలు.. గాంధీనగర్‌కు చెందిన మోటర్ల దొంగను ఇటీవల ఐడీ పార్టీ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి చోరీకి గురైన మోటార్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. చట్ట ప్రకారం రికవరీ చేసిన మోటార్లను బాధిత రైతులకు అప్పగించాల్సిన పోలీసులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తెలిసింది. తమ అదుపులోని దొంగతో రూ.50వేలకు ఒప్పందం చేసుకుని వదిలిపెట్టేసినట్లు సమాచారం. అలాగే సదరు నిందితుడి నుంచి చోరీ సొత్తును కొనుగోలు చేసిన గుజరీ వ్యాపారి వద్ద మరో రూ.3లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కేసులో నిజనిజాలను ఉన్నతాధికారులు విచారణ చేపట్టి నిగ్గుతేల్చాలని స్థానికులు కోరుతున్నారు. దొంగలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఆవేదనలో రైతులు

మండలంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల విపరీతంగా చోరీలు జరిగాయి. ప్రధానంగా మోటార్లు అధిక సంఖ్యలో అపహరణకు గురయ్యాయి. మార్కెట్ యార్డు, పాకాల–చిత్తూరు మార్గంలోని రైల్వేగేటు సమీపంలో, రౌనక్‌నగర్‌లో, బండపాకాలకు సమీపంలోని బసీదు పక్కన పొలంలో, పత్తిపాటివారిపల్లెలో,వల్లివేడులో మొత్తం 8 మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. అలాగే పాకాల పెట్రోలు బంకు సమీపంలోని పొలాల్లో కాపర్ వైర్లు అహరించారు. ఇవి కాకుండా మరో పది మంది రైతులకు చెందిన మోటార్లు కూడా చోరీకి గురైనట్లు తెలిసింది. ఈ క్రమంలో మోటార్ల దొంగ పట్టుబడినా నగదు తీసుకుని పోలీసులు వదిలేయడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెటర్నరీ విద్యార్థుల మెరుపు ధర్నా



పరిపాలనా భవనంలో ధర్నా నిర్వహిస్తున్న జూడాలు

తిరుపతి సిటీ : గౌరవవేతనం పెంచాలంటూ పశు వైద్య విద్యార్థులు చేపట్టిన సమ్మె 26వ రోజుకు చేరింది. శుక్రవారం ఈ మేరకు ఎస్వీ వెటర్నరీ పరిపాలనా భవనం వద్ద విద్యార్థులు మెరుపు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ వర్సిటీ అధికారులు, ప్రభుత్వం తమ సమస్యపై స్పందించకపోవడం దారుణమన్నారు. సమ్మెను అడ్డుకునేందుకు వర్సిటీలోని వసతిగృహాలను మూసివేయాలని నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా స్టయిఫండ్ పెంచేవరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఎస్వీయూలో 137 మంది బదిలీ

తిరుపతి సిటీ : ఎస్వీయూలో రెండో విడత అంతర్గత బదిలీల్లో భాగంగా శుక్రవారం 137 మంది ఉద్యోగులను పలు విభాగాలకు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులు ఈనెల 7వ తేదీ లోపు తమకు కేటాయించిన విధులకు హాజరుకావాలని రిజిస్ట్రార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ ప్రక్రియ పారదర్శకంగా జరగలేదని, సామాజిక ప్రాతిపదికన వివక్ష పూరితంగా వ్యవహరించారని పలువురు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

రుయా.. వేతనాల్లేవయా!

తిరుపతి తుడా : ''ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా... రుయాలోని ఉద్యోగులకు ఈ నెల వేతనాలు రావు'' అంటూ శుక్రవారం విడుదలైన సర్క్యులర్ సిబ్బందిలో కలవరం రేపింది. వివరాలు.. రుయాలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వేతనాల మంజూరు పరిధిని రుయా అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి ఎస్వీ మెడికల్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్‌కు బదలాయిస్తూ ప్రభుత్వం నెలన్నర క్రితం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినందున ఈ నెల జీతాలు రావని అధికారులు సర్క్యులర్ జారీ చేసి చేతులుదులిపేసుకున్నారు. దీంతో ఉద్యోగులుభగ్గుమంటున్నారు. మార్చి ఒకటో తేదీనే కాకుండా, మరో ఒకటి రెండు నెలలు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందని మండిపడుతున్నారు. ఇంత కాలం జీతాలు రాకుంటే కుటుంబ పోషణ ఎలా అని మథనపడుతున్నారు. ప్రభుత్వ నిర్వాకంపై ఉద్యోగ సంఘాల నేతలు నోరు మెదపకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చంద్రగిరి: చంద్రగిరి–తిరుపతి మార్గంలోని తొండవాడ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు మాదంలో ఇద్దరు తీవ్రగాయాలకు గురైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తొండవాడ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికునిగా పనిచేస్తున్న విజయకుమార్ నడిచివెళ్తుండగా, చంద్రగిరి నుంచి తిరుపతికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గౌస్‌బాషా ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో నడచివెళ్తున్న కార్మికుడ్ని ఢీ కొట్టారు. పోలీసులు, స్థానిక 108 వాహనం ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ ఇరువురినీ తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

శాస్త్ర సాంకేతికరంగాల్లో విశ్వగురువుగా భారత్

తిరుపతి సిటీ: శాస్త్ర సాంకేతిక రంగాల్లో 2047 నాటికి భారత్ విశ్వగురువుగా ఆవిర్భవిస్తుందని ఎస్వీయూ వీసీ అప్పారావు ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం శ్రీనివాస ఆడిటోరియంలో నేషనల్ సైన్స్‌డే నిర్వహించారు. సాంస్కృతిక విభాగం కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ అధ్యక్షతన సైన్స్ డ్రామా పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. వీసీ మాట్లాడుతూ దేశంలో శాస్త్ర, సాంకేతిక పరిశోధనలను ప్రోత్సహిస్తూ, వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు, దేవప్రసాద్ రాజు, ఎన్‌సి రాయుడు, ఆచార్యులు సురేంద్రబాబు, విజయభాస్కర్‌రావు, రుద్రమదేవి, నరసింహ, నాదముని, కళ్యాణ్, శరత్ బాబు పాల్గొన్నారు.

పద్మావతి మహిళా వర్సిటీలో

పద్మావతి మహిళా వర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో సైన్స్‌డే నిర్వహించారు. ఎస్వీయూ ప్రొఫెసర్ డాక్టర్ హేమలత రుద్రమదేవి పాల్గొని సీవీ రామన్ ఎఫెక్ట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీదేవి పాల్గొన్నారు. అలాగే ఎస్వీ ఆర్ట్స్, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సైన్స్‌డే చేపట్టారు.

పార్కుల పరిశుభ్రతకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: నగరంలోని పార్కులను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. శుక్రవారం శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఏర్పాటు చేస్తున్న మల్టీ స్పోర్ట్స్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణ పనులను, జగజ్జీవన్ రామ్ పార్కు పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ మరుగుదొడ్లు, వాకింగ్ ట్రాక్ శుభ్రంగా ఉంచాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఫెసిలిటీ సెంటర్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్యామ్‌సుందర్, తుడా ఈఈ రవీంద్ర, ఎంఈ తులసి కుమార్, డీఈలు రాజు, మధు, మహేష్, రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, ఏఈకాం ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం

తిరుపతి సిటీ : నగరంలో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం విధించామని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ కోరారు. శుక్రవారం తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో తలెత్తే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య పాల్గొన్నారు

విద్యార్థులకు మెరుగైన వసతులు

తిరుపతి అర్బన్ : జిల్లాలో ఈ నెల 3వ తేదీ నుంచి 15 వరకు నిర్వహించనున్న సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్ పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని డీఈఓ కేవీఎస్ కుమార్ ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ సిట్టింగ్ స్క్వాడ్ నిఘా పటిష్టం చేయాలని చెప్పారు. విద్యార్థినులకు మహిళా ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేసినట్లు సూచించారు. దయం 8.30 గంటల నుంచే విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని కోరారు. ఎవరికైనా సమస్యలుంటే 7569787131 నంబర్‌కు తెలియజేయాలని స్పష్టం చేశారు.

పరిపూర్ణం.. బ్రహ్మోత్సవం



త్రిశూల స్నానం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం ఉదయం కపిలతీర్థం ఆవరణలోని పుష్కరిణిలో వైభవంగా త్రిశూల స్నానం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనటరాజ స్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శాస్త్రోక్తంగా జరిపించిన ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణమయ్యాయి. రాత్రి రావణవాహనంపై స్వామివారు ఊరేగారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డిజిటల్ మోసాలపై అవగాహన



ర్యాలీలో కెనరా బ్యాంక్ ఉద్యోగులు

తిరుపతి అర్బన్ : డిజిటల్ మోసాలపై అవగాహన కల్పిస్తూ కెనరా బ్యాంకు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఈ మేరకు కెనరా బ్యాంక్ ప్రధాన కార్యాలయం నుంచి సర్కిల్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. బ్యాంక్ జీఎం పాండురంగ మితంతాయ, డీజీఎం జీఎస్ మూర్తి, రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

మొబైల్ షాప్లో చోరీ

తిరుపతి క్రైమ్: తిరుపతి కరకంబాడి రోడ్డులోని ఆకారం పల్లి వద్ద ఓ మొబైల్ షాప్లో చోరీ జరిగిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఆకారంపల్లిలోని హెచ్‌ఎస్ ఎంటర్‌ప్రైజెస్ మొబైల్ షాపుని శ్రీకాంత్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తి గురువారం రాత్రి రేకులు సీట్లు కట్ చేసి షాపులో రూ.1,67,111 విలువ చేసే 11 మొబైల్ ఫోన్లను దొంగలించాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి పనుల్లో గోల్‌మాల్



అగరాలలో అక్రమాలకు సంబంధించిన ఆధారాలను పీడీకి అందిస్తున్న సర్పంచ్ భాస్కర్ రెడ్డి

చంద్రగిరి: ఉపాధి హామీ పథకంలో భారీగా గోల్‌మాల్ చోటు చేసుకుంది. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి అధ్యక్షతన సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. పంచాయతీల వారీగా పనుల వివరాలను ఆడిట్ సిబ్బంది వినిపించారు.

అడుగడుగునా తప్పుల తడకే

2023–24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనులపై ఆడిట్‌లో తప్పుడు లెక్కలను సిబ్బంది బయట పెట్టారు. ఏ.రంగంపేట పంచాయతీలో స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి తన భార్య ఉపాధి పనులు చేయకపోయినా బిల్లులను తీసుకుంటున్నట్లు వివరించారు. మామండూరు మస్టర్లలో మొక్కలు లేకుండానే బిల్లులు చేసినట్లుగా గుర్తించారు. దోర్నకంబాల మస్టర్లలో సంతకాలు లేకండానే పేమెంట్ చేశారు. పిచ్చినాయుడుపల్లిలో ఫీల్డ్ అసిస్టెంట్ కూలీలకు బదులుగా మరొకరితో పనులు చేయించి వారికి బిల్లులు మంజూరు చేసినట్లు గుర్తించి, ఫీల్డ్ అసిస్టెంట్‌కు రూ.5వేల జరిమానా విధించారు. గంగుడుపల్లిలో ఇంకుడు గుంతలు లేకపోయినా బిల్లులు చేసుకున్నట్లు తేల్చారు. భీమవరంలో ఇంకుడు గుంతలు తవ్వి, బిల్లులు చేసుకుని ఆపై పూడ్చేసినట్లు నివేదికలో తెలిపారు.

ఆగరాలలో అక్రమాలపై విచారణ

అగరాల పంచాయతీలోని ఉపాధి పనుల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆడిట్ సిబ్బంది తెలిపారు. దీంతో సర్పంచ్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీలో 14 మంది ఉపాధి పనిచేస్తుంటే 48 మంది చేస్తున్నట్లుగా మస్టర్లలో నమోదు చేసి భారీగా నగదును దోచుకున్నారని పీడీకు ఫిర్యాదు చేశారు. వాటికి సంబంధించిన ఆధారాలను ఆయనకు అందజేశారు. సుమారు రూ.4.16లక్షలకు పైగా అవినీతి చోటు చేసుకుందని తెలిపారు. ఉపాధి కూలీలు శంకరమ్మ, చీరాలయ్యతో పాటు మరికొంత మందికి తెలియకుండానే వారి పేరుపై మస్టర్లలో నమోదు చేసి నగదు కాజేసినట్లుగా ఆడిట్ సిబ్బంది తెలియజేశారు. దీనిపై వారంలోపు విచారణ చేపట్టాలని పీడీ శ్రీనివాస ప్రసాద్, ఎంపీడీఓ శేఖర్‌ను ఆదేశించారు. అదే విధంగా రాయలపురం రెండు ఎకరాలకు పైగా చెరువును కబ్జా చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన ఆదేశించారు.

తెలుగు భాష ప్రాధాన్యత పెరగాలి



మాట్లాడుతున్న ఉస్మానియా వర్సిటీ ఆచార్యుడు కసిరెడ్డి వెంకటరెడ్డి

తిరుపతి సిటీ: తెలుగు రాష్ట్రాల్లో తెలుగు భాష ప్రాధాన్యత పెరగాలని హైదరాబాద్ ఉస్మానియా వర్సిటీ ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఎస్వీయూ సెనేట్ హాల్ వేదికగా తెలుగు అధ్యయన శాఖ, ప్రాచ్య పరిశోధనా సంస్థ, బెంగళూరుకు చెందిన తెలుగు సంపద సంయుక్త ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరిగిన మూడవ అంతర్జాతీయ తెలుగు భాష సమావేశాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. భాషా సంబంధ పరిశోధనలు విశ్వవిద్యాలయాల్లో మరింతగా సాగాలని పిలుపునిచ్చారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన శాశ్వత పరిష్కారం కాదని అభిప్రాయపడ్డారు. తెలుగు గొప్పదనాన్ని వివరిస్తూ ప్రచారం చేయాలని ఏడు తీర్మానాలను ఆమోదించారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు, నిర్వాహకులు ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు, ఆర్ రాజేశ్వరమ్మ, రేమిళ్ల మూర్తి, ప్రిన్సిపల్ సుధారాణి, రచయితలు పాల్గొన్నారు.

చార్టర్డ్ అకౌంటెంట్ల కమిటీ ఎంపిక



నూతన కమిటీ ప్రతినిధులు


తిరుపతి కల్చరల్ : అఖిల భారత చార్టర్డ్ అకౌంటెంట్స్ తిరుపతి శాఖ నూతన కమిటీని శుక్రవారం ఎంపిక చేశారు. కమిటీ అధ్యక్షుడిగా బీవీ మధుసూదన బాబు, ఉపాధ్యక్షుడిగా మన్నెమ్ సింహాద్రి నాయుడు, కార్యదర్శిగా బాలాజీ కామిశెట్టి, కోశాధికారిగా సీఏ ఎం.నరేంద్ర, ఎస్ఐసీఏఎస్ఏ చైర్మన్‌గా సీఏఏ తిరుమలేశ్వర నాయుడు, సభ్యుడిగా ఏ.మదన మోహన్‌రెడ్డి ఎంపికయ్యారు. కార్యక్రమంలో రఘురామిరెడ్డి, నరసింహులు, జగదీష్ కృష్ణ, జి.రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.


కామన్ పీజీ సెట్ రద్దు చేయాలని ధర్నా


తిరుపతి అర్బన్ : ఉమ్మడి పీజీ సెట్‌ను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. వారు మాట్లాడుతూ పీజీ సెట్‌ల నిర్వహణపై ఎన్నికల ముందు నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ఆయా వర్సిటీలకే పీజీ సెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు. లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అధికారలకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నేతలు బండి చలపతి, మల్లికార్జున, ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, అక్బర్, సుందర్ రాజ్, శివశంకర్ నాయక్, మహేంద్ర నాయక్, భార్గవ్, చంద్రనాయక్, వినోద్, మోహన్, విష్ణు, సురేష్ పాల్గొన్నారు.

'విజ్ఞాన'ం.. విశేషం

పద్మావతీపురం జెడ్పీ హైస్కూల్లో నమూనాలను పరిశీలిస్తున్న డీఈఓ కేవీఎస్ కుమార్ , సోక్రటీస్‌లో.., విశ్వంలో..








తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లోని శుక్రవారం ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలు, కాలేజీల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను అధికారులు, ప్రముఖులు పరిశీలించారు. పిల్లలను ప్రతిభను ప్రశంసించారు. విద్యార్థుల మేధస్సును గుర్తించి ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. - తిరుపతి ఎడ్యుకేషన్/తిరుపతి సిటీ/చంద్రగిరి/ పాకాల









పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో.. , శ్రీచైతన్యలో.. , పాకాల హైస్కూల్‌లో.. , చంద్రగిరి: నరసింగాపురం జెడ్పీ హైస్కూల్‌లో..